
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి





నారాయణపూర్ రిజర్వాయర్

'నారాయణపూర్'పై నిర్లక్ష్యం

- రిజర్వాయర్ కింద 60 వేల ఎకరాల ఆయకట్టుకు నీరు
- మరమ్మతులకు నోచుకోని కాలువలు
- పూర్తి కాని కుడికాలువ
- పరిష్కారానికి నోచుకోని సమస్యలు

గంగాధర, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలంలో కీలక ప్రాజెక్టులు ఉన్నా ప్రభుత్వ నిర్లక్ష్యం వెంటాడుతోంది. నారాయణపూర్ రిజర్వాయర్‌లో నీరు, మండలం చుట్టూ వరద కాలువలో నీరు నిల్వ ఉండడంతో భూగర్భ జలాలు పెరిగాయి. గంగాధర మండలం నారాయణపూర్ చెరువు, గంగాధర ఎల్లమ్మ చెరువులను కలుపుతూ రిజర్వాయర్‌ను చేసి గంగాధర, రామడుగు, చొప్పదండి, కొడిమ్యాల, మల్యాల, బోయినపల్లి మండలాలకు సాగు నీరందించాలని ప్రణాళిక రూపొందించారు. ఇందులో భాగంగా 2005లో అప్పటి ప్రభుత్వం పనులు ప్రారంభించింది. ఎల్లంపల్లి నుంచి మేడారం.. అక్కడి నుంచి పైపులైను వేసి నారాయణపూర్ రిజర్వాయర్‌లోకి ఎత్తిపోతలద్వారా నీటిని నింపుతారు. రిజర్వాయర్‌కు ఎడమ, కుడి కాలువను నిర్మించి 60 వేల ఎకరాలకు సాగు నీరందించడంతోపాటు నియోజకవర్గంలోని చెరువులను నింపాలని అధికారులు ప్రణాళికలు తయారు చేశారు.

అస్తవ్యస్తంగా ఉప కాలువలు

ఎడమ ప్రధాన కాలువ పూర్తి చేసి దానికి ఉప కాలువను తవ్వారు. ఎడమ కాలువకు మూడేళ్ల క్రితం ఇరువైపుల సిమెంటు చేశారు. నాణ్యత లోపంతో ఎక్కడికక్కడ బీటలు సిమెంటు వేసి ఊడిపోతు కాలువ కోతలకు గురవుతోంది. సుమారు 19 ఉపకాలువలు ఏర్పాటు చేయగా వాటికి సిమెంటు చేయక కాంట్రాక్టరు వదిలేశాడు. ఉప కాలువలు ఏర్పాటు చేయగా అక్కడక్కడా రైతులు పొలాలకు వెళ్లడానికి బ్రిడ్జిలు మంజూరు చేసిన పనులు చేయకుండా వదిలేశారు. పదేళ్లుగా కాలువకు అవతలి వైపు పొలాలకు వెళ్లడానికి రైతులు తీవ్ర ఇబ్బందుల పడుతున్నారు. కుడి కాలువకు నిధుల కొరతతో పనులు నిలిచిపోగా రెండేళ్ల క్రితం ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఇక్కడ పనులు నత్తనడకన సాగుతున్నాయి. కరీంగనర్, జగిత్యాల ప్రధాన రహదారిపై బ్రిడ్జి నిర్మించాల్సి ఉంది. పలు ఇళ్లు ముంపునకు గురవుతున్నాయి. కుడికాలువ పూర్తయితే గంగాధర, రామడుగు, బోయినపల్లి, వేములవాడ మండలాల బీడు భూములకు సాగునీరందే అవకాశముంది.

ముంపు సమస్యల పరిష్కామెప్పుడు?

గంగాధర చెరువు మంగపేట శివారులో ఉంటుంది. ఈ చెరువులో మంగపేటకు చెందిన రైతులది 86 ఎకరాల వ్యవసాయ భూములు ముంపునకు గురవుతోంది. ఇటీవల వాటికి పరిహారం అందించారు. నారాయణపూర్ రిజర్వాయర్‌లోకి వరద నీరు చేరినా,



అసంపూర్తి కుడికాలువ

ఎల్లంపల్లి నీటితో నింపిన పత్రియేటా సమీప గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నారాయణపూర్ కట్ట సమీపంలోని ఇళ్ల ప్రజలు వర్షకాలం వస్తే చాలు ప్రాణాలు అర చేతిలో పెట్టుకుని గడుపుతుంటారు. రిజర్వాయర్‌లోని నీటిని విష పురులు ఇళ్లలోకి వస్తుంటాయి. రిజర్వాయర్‌కు సమీపంలోని ఇళ్లలోకి నీటి ఊటలు వస్తున్నాయి. పాత కాలపు మట్టి గోడలు పదనెక్కి కూలిపోతున్నాయి. రిజర్వాయర్ బ్యాక్ వాటర్‌తో చర్లపల్లి(ఎన్), మంగపేటలోని పలు ఇళ్లు ముంపునకు గురవుతున్నాయి. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి..

- కలెక్టరేట్ ఎదుట మాజీ సర్పంచ్‌ల దీక్ష



దీక్షలో పాల్గొన్న సర్పంచ్‌లు

సుభాష్‌నగర్, డిసెంబరు 9 (ఆంధ్ర జ్యోతి): పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతూ మాజీ సర్పంచుల జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్ష ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో పూర్తచేసిన పనులకు సంబంధించిన బిల్లులు నేటికీ విడుదల చేయలేదన్నారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని కొన్ని నెలలుగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామన్నారు. ఇంతవరకు బిల్లులు విడుదల చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరారు.

కాసులు కురిపిస్తున్న
ఆర్టీసీ కార్గో
- రూ.9 కోట్లకు చేరువలో రీజియన్ సంవత్సర ఆదాయం
- సగానికి పైగా ఆదాయం కరీంనగర్ కౌంటర్‌లోనే..

-భగత్‌నగర్, ఆంధ్రజ్యోతి

7

సమగ్రశిక్ష ఉద్యోగుల సమ్మె సైరన్

కరీంనగర్ టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో కీలకపాత్రను పోషిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మె సైరన్ మోగించారు. జిల్లాలో మంగళవారం నుంచి విధులను బహిష్కరించి సమ్మె చేయాలని నిర్ణయించారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల, కేజీబీవీల్లోని విద్యార్థులపై తీవ్ర ప్రభావం పడనున్నది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మె చేయగా పీసీసీ అధ్యక్షుడి హోదాలో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మద్దతు ప్రకటించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రెగ్యులరైజ్ చేస్తామని, మీ డిమాండ్లను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుండి సమగ్ర శిక్ష ఉద్యోగులు పలుమార్లు ఆందోళనలు చేస్తున్నారు. డిసెంబరు 10 వరకు తమ డిమాండ్లను పరిష్కరించాలని, లేకపోతే విధులను బహిష్కరించి నిరవధిక సమ్మె చేస్తామంటూ నోటీసును అధికారులకు అందజేశారు. ప్రభుత్వం స్పందించకపోవడంతో మంగళవారం నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించే వరకు నిరవధిక సమ్మెను కొనసాగిస్తామని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం స్పష్టం చేసింది.



కలెక్టరేట్ ఏవోకు సమ్మె నోటీసు అందజేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు(ఫైల్)

అరకొర వేతనాలు

ప్రభుత్వ ఉపాధ్యాయులతో సమానంగా విధులు నిర్వహిస్తున్న సమగ్ర శిక్ష సిబ్బందికి వేతనాలు అరకొరగానే ఉన్నాయి. 2006లో రాజీవ్ విద్యా మిషన్ పేరుతో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన వ్యవస్థలో కలెక్టర్లు చైర్మన్లుగా ఉన్న త్రీమెన్‌కమిటీ ద్వారా రోస్టర్ మెరిట్ ఆఫ్ రిజర్వేషన్ పద్ధతిలో ఇంటర్వ్యూలు నిర్వహించి ఒప్పంద ఉద్యోగులుగా వీరిని ఎంపిక చేశారు. జిల్లాలో 560 మంది పనిచేస్తున్నారు. పాఠశాలలకు సంబంధించిన అన్ని రకాల రిపోర్టులను తయారు చేసి ఎంఈవోలకు అందించడం, స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల నిర్వహణ చర్యలు చేపట్టడం వంటి కీలకమైన బాధ్యతలను నిర్వహిస్తున్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెతో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను వాయిదా వేశారు. మధ్యాహ్న భోజనం అందించడంలో వీరి పాత్ర కీలకంగా ఉంటుంది. వీరి సమ్మెతో మధ్యాహ్న భోజనం అమలు కూడా కష్టమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోవైపు మంగళవారం నుండి ప్రభుత్వం బడి బయట ఉండే విద్యార్థుల సర్వే కార్యక్రమాన్ని చేపడుతోంది. సమ్మెతో సర్వేపై ప్రభావం పడనున్నది. గత సెప్టెంబరులో 25 రోజులపాటు రిలే నిరసనలు చేపట్టిన సమగ్ర శిక్ష ఉద్యోగులు ఈసారి నిరవధిక సమ్మెకు వెళ్లడంతో పాఠశాల విద్యార్థులపై తీవ్ర ప్రభావం పడే అవకాశముందని చర్చించుకుంటున్నారు.

సమ్మెను విజయవంతం చేయండి

- బెజ్జంకి అంజనేయులు, జిల్లా గౌరవ అధ్యక్షుడు, సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం



తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు మంగళవారం నుంచి నిరధిక సమ్మెకు వెళుతున్నాం. కలెక్టరేట్ ఎదుట తలపెట్టిన నిరసన కార్యక్రమంలో లో ఉద్యోగులంతా పాల్గొని విజయవంతం చేయాలి. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తాము.

సంచార జాతులకు
అవకాశాలు కల్పించాలి

సుభాష్‌నగర్, డిసెంబరు 9 (ఆంధ్ర జ్యోతి): సంచార జాతులకు రాజకీయ అవకాశాలు కల్పించాలని తెలంగాణ సంచార జాతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తిపిరిశెట్టి శ్రీనివాస్ కోరారు. సోమవారం నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏ రాజకీయ పార్టీ కూడా సంచార జాతులను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఆరు ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీగా ఉన్నాయని, అందులో సంచార జాతులకు ఒక సీటు కేటాయించాలని కోరారు. ప్రస్తుతం పోటీలో ఉన్న సంచార జాతుల అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగజోగి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు పేరాల రామస్వామి, డాక్టర్ మేకల లింగయ్య, బీవీ సత్యం, మేకల గోవర్ధన్, మేకల సాంబయ్య, కడారి వీరయ్య, ముత్తయ్య శ్యామల, నర్సింహ, చిందం నర్సింహ, చిందం లింగస్వామి పాల్గొన్నారు.

ప్రజావాణికి 208 దరఖాస్తులు



దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

సుభాష్‌నగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమానికి 208 దరఖాస్తులు వచ్చినట్లు అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చాహత్‌బాజ్‌పాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్‌యాదవ్, డీఆర్వో వెంకటేశ్వర్లు, ఆర్డీవో మహేశ్వర్ పాల్గొన్నారు.

'మధ్యాహ్న భోజన బిల్లులు చెల్లించాలి'

పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన బిల్లులు వెంటనే చెల్లించాలని తెలంగాణ ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్న భోజన వంట కార్మికుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాబాయి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం ప్రజావాణిలో అదనపు కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులుగా 23 సంవత్సరాలుగా చాలీచాలని జీతంతో పని చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు బుర్ర మంజుల, పి నిర్మల, నజియ, షహీన్ పాల్గొన్నారు.

వరద కాలువకు తూములు ఏర్పాటు చేయండి

గ్రామ చెరువును నింపడానికి వరద కాలువకు తూములు ఏర్పాటు చేయాలని చొప్పదండి మండలం దేశాయిపేట గ్రామస్థులు కోరారు. ఈ మేరకు ప్రజావాణిలో అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్‌కి వినతిపత్రం అందజేశారు.

కార్మికులకు బెనిఫిట్స్ ఇప్పించాలి

భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం నుంచి రావలసిన బెనిఫిట్స్ ఇప్పించాలని దళిత బహుజన లేబర్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అలువాల ప్రశాంత్ కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు రావసిన బెనిఫిట్స్ ఆరు నెలలుగా అందడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వాటిని విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో విజయ్, వెంకటేష్, కె రమేశ్, ఎస్ రమేశ్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపిక



విద్యార్థికి ప్రశంస పత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోమటికొండాపూర్ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో 6వతరగతి చదువుతున్న తెడ్డు నశ్విత రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు గడ్డం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈనెల 6,7 తేదీల్లో జగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శనలో వనరుల నిర్వహణ విభాగంలో ప్రొటెక్షన్ ఆఫ్‌రెయిన్ వాటర్ ప్రాజెక్ట్‌లో జిల్లాస్థాయి ప్రథమ బహుమతి సాధించినట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపికైనందున జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, జిల్లా విద్యాధికారి రాము ప్రశంస పత్రం అందజేశారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ రాధిక, ఉపాధ్యాయులు జ్యోష్న, సుధ రాణి, విశాల్, రాణిలో పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో నేటి నుంచి గీతాజయంతి మహోత్సవం

వేములవాడ కల్చరల్, డిసెంబ రు 9 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజ రాజేశ్వరస్వామి ఆలయంలో మంగళ వారం నుంచి మూడు రోజులపాటు గీతాజయంతి మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల సందర్భంగా 10వ తేదీ మంగళవారం నుంచి 12వతేదీ గురువారం వరకు ఉదయం 7.30 గంటల నుంచి స్వామివారి నాగిరెడ్డి మండపంలో మహాన్యాసపూర్వక ఏకాదశరుద్రాభిషేకం, అర్చనలు, గీతాహోమం, గీతా ప్రవచనములు నిర్వహించనున్నారు. రాజన్న అనబంధ ఆలయాల్లో అర్చనలు, సాయంత్రం 4గంటల నుంచి శ్రీమద్భాగవతము దశామస్కంద పురాణ ప్రవచనము చేపట్టనున్నట్లు తెలిపారు. 12వ తేదీన ఉదయం 11.15 గంటలకు పూర్ణాహుతి అనంతరం కలశోద్వాసనము నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గీతాజయంతి ఉత్సవాల సందర్భంగా రాజన్నఆలయంలో భక్తులకు అభిషేకాలకు ఉదయం 8 గంటల నుంచి అనుమతి ఇవ్వనున్నారు.

కాసేపు ఫోన్‌కు దూరంగా..



● ఇండోర్ గేమ్స్ ఆడుతూ..

● చిన్నారులు, యువత ఆట, పాటలతో ఉత్సాహం

ఇంట్లో ఉన్నా..బయట ఉన్నా.. పని ఉన్నా లేకున్నా చేతిలో స్మార్ట్ ఫోన్ చూస్తూ ఉండడం షరా మామూలైపోయింది. ఇంట్లో కుటుంబ సభ్యులతో గడపడం కన్నా ఫోన్‌తో గడపడం నిత్యం అలవాటుగా మారిపోయింది. మరి ఇంట్లో పెద్ద వాళ్లను చూసో ఏమో గానీ పిల్లలు కూడా చాలా వరకు స్మార్ట్ ఫోన్‌కు వ్యసనంగా మారుతున్నారు. ఇంట్లో కుటుంబ సభ్యులు కూడా ఖాళీ ఉన్న సమయాల్లోనూ చేతిలో ఫోన్‌తోనే గడిపేస్తున్నారు. అలా అందరూ కూర్చుని పది నిమిషాల పాటు ఒకరికొకరు మాట్లాడుకునే సందర్భం కనుమరుగవుతోంది. స్మార్ట్ ఫోన్ నుంచి కాసేపు దూరంగా ఉండేందుకు కాస్త వెరైటీగా ఆలోచించారు ఆ యువకులు. కాసేపు ఫోన్ పక్కన పెట్టి ఇన్‌డోర్ గేమ్స్‌కు ఆటలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. అలనాటి పాత ఆటలతో కాలక్షేపంతో పాటు అందరం కలుసుకుంటున్నామని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పిల్లలను సైతం ఈ ఆటల్లో ప్రోత్సహించడంతో స్మార్ట్ ఫోన్‌కు దూరంగా ఉంటున్నారు.



ఇండోర్ గేమ్స్ ఆడుతున్న చిన్నారులు

మల్యాల, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఈ రోజుల్లో ప్రతి ఒక్కరికీ సెల్‌ఫోన్ అందుబాటులో ఉండగా మొబైల్ లేనిదే నిద్ర లేవలేని పరిస్థితులు నెలకొన్నాయి. నిద్ర లేచిన నుంచి పడుకునే వరకు దైనందిన జీవితంలో సెల్‌ఫోన్ లేనిదే ఎలాంటి కార్యకలాపాలు జరుగలేని విధంగా స్మార్ట్‌ఫోన్ అలవాటైపోయింది. మాట్లాడడంతో పాటు డబ్బుల లావాదేవిలకు, వినోదం, ప్రయాణాలకు, కాలాక్షేపం లాంటి ఇంకా అనేక అంశాలతో సెల్‌ఫోన్ ముడిపడింది. ముఖ్యంగా చిన్నారులు ఫోన్‌కు అలవాటు పడుతుండడంతో వారి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. దీన్ని గమనించిన కొందరు యువకులు స్మార్ట్‌ఫోన్ నుంచి కొంత మేర అయినా బయట పడేందుకు కొత్త ఆలోచనతో ముందుకు వచ్చారు. మల్యాల మండలం రామన్నపేటలో నెలరోజులుగా గ్రామానికి చెందిన ఎం.డీ అజర్, కోరుట్ల రవి మరి కొందరు నిర్వహిస్తున్న ఈ కార్యకలాపాలకు ప్రజల నుంచి అభినందనలు అందుతున్నాయి.

● ఆటలతో స్మార్ట్‌ఫోన్‌కు దూరంగా..



పాఠశాలకు వెళ్లి వచ్చిన చిన్నారులు ఇంటికి రాగానే స్మార్ట్‌ఫోన్ పట్టడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందు తుండడంతో ఈ యువకులు ప్రత్యేకంగా ఓ గదిని అద్దెకు తీసుకొని కొంత డబ్బులు పోగు చేశారు. వాటితో క్యారం బోర్డు, బ్యాడ్మింటన్, చెస్ ఆడేవి తదితర పరిక రాలు, ఇతర క్రీడా సామగ్రి కొనుగోలు చేసి అందుబాటులో ఉంచారు. ఇందులో ఆటలతో పాటు చదువుకోవ డం, హోంవర్క్ చేయడం అలాగే చిన్నారులతో పాటు పెద్ద వారు సైతం వ్యాయామాలు చేస్తున్నారు. దీంతో కొన్ని గంటల పాటు అయినా చిన్నారులు, పెద్దలు స్మార్ట్ ఫోన్‌కు దూరంగా ఉంటారనేది వారి ఆలోచన.

● ఇప్పటికే అనేక సామాజిక కార్యక్రమాలు

రామన్నపేట గ్రామస్థుల మన ఊరు-మనవార్తలు వాట్సప్‌గ్రూప్‌తో ఇప్పటికే అనేక సామాజిక కార్యక్ర మాలు నిర్వహిస్తుండగా స్మార్ట్‌ఫోన్ వినియోగంతో కలిగే దుష్ప్రబావాల నియంత్రణకు ప్రతి రోజు సాయంత్రం ఆరు గంటల నుంచి వృద్ధులు, మహిళలు, చిన్నారులు, యువకులు అందరు ఒక చోట కలిసేలా ఏర్పాటు చేశారు. యువకుల ఆలోచనకు గ్రామస్థుల తోడ్పాటు అందడంతో నిత్యం ఇక్కడకు వచ్చే వారి సంఖ్య పెరుగుతోంది. ఆట. పాటలతో పాటు పుట్టిన రోజు, వివాహ వార్షికోత్సవాలు తదితర కార్యక్రమాలు కూడా చేసుకుంటున్నారు. కాసేపు స్మార్ట్‌ఫోన్ గురించి మరచిపోతుండడంతో గత గుర్తులు మళ్లీ యాదికొస్తున్నాయంటూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులు స్క్రీన్ టైం మోతాదుకు మించి వాడి ఆన్‌లైన్ గేమ్స్ నుంచి బయట పడకపోవడంతో అనారోగ్యంపై ప్రభావం చూపుతోందని, చిరాకు, మొండిగా ప్రవర్తించడాన్ని నివారించడానికి ఇంకా అనేక ఆలోచనలకు ఆ యువకులు పునాది వేస్తున్నారు.



కొనుగోలు చేసిన వివిధ రకాల పుస్తకాలు

● స్మార్ట్‌ఫోన్ వ్యసనం నుంచి బయటపడేందుకు..



స్మార్ట్‌ఫోన్ వ్యసనం నుంచి బయటపడేందుకు తాము ఈ కార్యక్రమం చేపట్టాము. స్మార్ట్‌ఫోన్ వల్ల కలిగే నష్టాలు, హానికర యాప్స్, సమయ నియంత్రణపై అవగాహన కల్పిస్తున్నాము. ఆరోగ్యకరమైన జీవన శైలి కోసం తాము ఈ ప్రయత్నం చేశాము. ప్రజలు, చిన్నారులు సద్వినియోగం చేసుకుంటున్నారు.

- ఎం.డీ అజర్, వ్యవస్థాపక సభ్యుడు, రామన్నపేట

● కాలక్షేపం చేస్తున్నాం



స్మార్ట్‌ఫోన్ పక్కన పెట్టి నిత్యం ఇక్కడకు వచ్చి ఆటలు ఆడుతూ, కబుర్లు చెప్పుకుంటూ కాలక్షేపం చేస్తున్నాం. దీంతో ఆ సమయంలో స్మార్ట్‌ఫోన్ వాడడం లేదు. క్యారం, అష్టాచమ్మాలాంటి పాత ఆటలు ఆడు తూ మైమరిచిపోతున్నాం. పుస్తకాలలోని బొమ్మలతో సరదాగా ఉంటుంది. సెల్‌ఫోన్ వాడడం దాని వల్ల కలిగే నష్టాల గురించి చెబుతున్నారు.

- గీతాంజలి, గ్రామస్థురాలు

క్రైం కార్నర్

మొక్కజొన్న పంటలపై అడవి పందుల దాడి

● 15 ఎకరాల్లో పంట ధ్వంసం



పొత్కపల్లిలో ధ్వంసమైన మొక్కజొన్న పంట

ఓదెల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొత్కపల్లి, రూపునారాయణపేట, జీలకుంట, శానగొండ, గొల్లపల్లి, గ్రామాల్లోని మొక్కజొన్న పంటలపై ఆది, సోమవారాల్లో అడవి పందులు దాడి చేసి బీభత్సం సృష్టించాయి. పొత్కపల్లి అనుబంధ గ్రామం గొల్లపల్లికి చెందిన కనవేని కొమురయ్య అనే రైతుకు చెందిన ఎకరంన్నర మొక్కజొన్న పంటను దాదాపు 50 శాతం ధ్వంసం చేశాయి. లేత గింజ దశలో ఉన్న మొక్కజొన్నను అడవి పందుల గుంపు ధ్వంసం చేస్తుండడంతో రాత్రింబవళ్లు సైతం కాపలా కాస్తున్నామని, అయినప్పటికీ పంట ధ్వంసం అగడం లేదని కొమురయ్య ఆవేదన వ్యక్తం చేశారు. చేతికంది వచ్చిన మొక్కజొన్న పంటల్లోనే పందులు తిష్ట వేసి ధ్వంసం చేయడమే కాకుండా, ఒంటరిగా ఉన్న రైతులపై కూడా దాడికి ప్రయత్నిస్తున్నాయని రూప్‌నారాయణపేట, జీలకుంట రైతులు తెలిపారు. అడవి పందుల నుంచి పంటలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని అటవీశాఖ అధికారులను రైతులు కోరారు.

బైక్ అదుపుతప్పి యువకుడి మృతి

ఎలిగేడు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాములపల్లి-నారాయణపూర్ గ్రామాల మధ్య ఉన్న ఎస్సారెస్పీ ఉపకాలువ వద్ద బైక్ అదుపుతప్పి అదేకాలువలో పడి సిరిసిల్ల కిరణ్(37) అనే యువకుడు మృతి చెందాడు. జూలపల్లి ఇన్‌చార్జి ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గోదావరిఖని పవర్‌హౌస్ కాలనీకి చెందిన కిరణ్ కరీంనగర్‌లోని ఫైనాన్స్ కంపెనీలో సేల్స్ ఎగ్జిక్యూటీవ్‌గా పని చేస్తున్నాడు. జూలపల్లి మండలం చీమలపేటకు చెందిన తన స్నేహితుడిని కలిసి తిరుగు ప్రయాణంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడు కిరణ్ భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నరేష్ పేర్కొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

● బంగారం, వెండి, నగదు అపహరణ



చిందరవందరగా పడి ఉన్న వస్తువులను పరిశీలిస్తున్న సీఐ

కమాన్‌పూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్‌గా చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్నారు. తాజాగా మండల కేంద్రంలోని పోస్టాఫీస్ వీధిలో బిల్లా రాజయ్య ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. హైదరాబాద్‌లో ఉంటున్న కుమారుడి ఇంటికి గత నెల 27న వెళ్లారు. ఆదివారం రాత్రి వచ్చేసరికి ఇంటి తాళం పగలగొట్టి ఉంది. ఇంట్లో వెళ్లి చూడగా ఇంట్లోని బీరువాను పగలగొట్టి అందులో ఉన్న 11 తులాల బంగారం, 80 తులాల వెండి, రూ. 30 వేల నగదును గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా సోమవారం గోదావరిఖని టూటౌన్ సీఐ నక్క ప్రసాద్, ఎస్ఐ కొట్టె ప్రసాద్, పోలీస్ సిబ్బంది ఇంటి పరిసరాలను పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక డంపుల స్వాధీనం



నిలువ ఉన్న కుప్పలను సీజ్ చేస్తున్న ఆర్ఐ మహ్మద్ అమర్

కోరుట్ల రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎఖీన్‌పూర్ నుంచి ఎస్సారెస్పీ కాలువ ద్వారా నాగులపేటకు వెళ్లే రహదారిని అనుకుని ఉన్న ఖాళీ స్థలంలో అక్రమంగా నిలువ ఉన్న ఇసుక కుప్పలను సోమవారం ఆర్ఐ మహ్మద్ అమర్ ఆధ్వర్యంలో పట్టుకున్నారు. సుమార్ 50 నుంచి 60 ఇసుక కుప్పలు ఉన్నట్లు వాటిని సీజ్ చేసినట్లు ఆర్ఐ మహ్మద్ అమర్ తెలిపారు. నాగులపేట నుంచి కోరుట్ల వైపు అక్రమంలో ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఆర్ఐ తెలిపారు. ట్రాక్టర్లను రెవెన్యూ కార్యాలయానికి తరలించినట్లు ఆర్ఐ వివరించారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు

మల్లాపూర్ : అనుమతులు లేకుండా గోదావరి, వాగుల పరివాహక ప్రాంతాల నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని మల్లాపూర్ తహసీల్దార్ వీర్‌సింగ్ హెచ్చరించారు. సోమవారం మండలంలోని వాల్గొండ గ్రామ శివారులోని గోదావరి నుంచి అక్రమంగా ఇసుకతో వెళ్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని చర్యల నిమిత్తం తహసీల్దార్ కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు.

ఇసుక లారీలను అడ్డుకున్న ఊటూర్ గ్రామస్థులు

మానకొండూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఊటూర్ మానేరు వాగు నుంచి ఇసుకను తరలించడంతో రోడ్డు దెబ్బతింటుందని గ్రామస్థులు సోమవారం రాత్రి ఇసుక లారీలను అడ్డుకున్నారు. ప్రతినిత్యం వందలాది లారీలు మానేరు వాగు నుంచి ఇసుకను తరలించడం వల్ల రోడ్డు దెబ్బతినడమే కాకుండా దుమ్ము, ధూళితో రోడ్డుప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చొరువ తీసుకొని రోడ్డు నిర్మాణం చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

శంకరపట్నం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కొత్తగట్టు గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బీహార్ రాష్ట్రానికి చెందిన మోహన్‌కుమార్ (21) అనే వ్యక్తి గోపాల్‌పూర్‌లోని వల్లెపు యాదగిరి వద్ద కూలీ పనిచేస్తున్నాడు. ఆదివారం అర్ధరాత్రి గోపాల్‌పూర్ నుంచి కొత్తగట్టుకు టీఎస్03ఈఆర్0606 ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. బైక్ అజాగ్రత్తగా, అతివేగంగా నడపడంతో కొత్తగట్టు గ్రామ శివారులోని జేసీఎం ఫంక్షన్ హాల్ వద్ద డివైడర్‌ను ఢీకొట్టాడు. దీంతో మోహన్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రిలోని మార్చురీకి తరలించారు. మృతుడి సోదరుడు అమర్ చౌదరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ముస్తాబాద్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం అదుపు తప్పి చెట్టును ఢీకొని ఓ యువకుడి మృతిచెందిన సంఘటన ముస్తాబాద్ మండలంలోని గుడెం శివారులో చిప్పలపల్లి గ్రామంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే చిప్పలపల్లి గ్రామానికి చెందిన జంగిటి సాయి(18) అనే యువకుడు డీజిల్ తీసుకురావడానికి వెళ్తుండగా గూడెం మూలమలుపు వద్ద బైక్ చెట్టుకు ఢీకొని అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి తల్లిదండ్రులు కిషన్ భాగ్యలు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ముగ్గురు ఆడపిల్లల తరువాత ఉన్న ఒక్క కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రమాదానికి సంబంధించిన వివరాలను సేకరించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గణేష్ తెలిపారు.

దుబాయ్‌లో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్(టామ్‌కామ్) ఆధ్వర్యంలో దుబాయ్‌లో బైక్‌రైడర్స్ డెలివరీ బాయ్స్ సెక్యూరిటీగార్డు ఉద్యోగాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి తెలిపారు. డెలివరీ బాయ్స్, బైక్ రైడర్ల ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ ఉత్తీర్ణతతో కనీసం రెండు సంవత్సరాల డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. అభ్యర్థుల వయస్సు 21-40 సంవత్సరాల మధ్య ఉండి పాస్‌పోర్టు ఉన్నవారు అర్హులని తెలిపారు. సెక్యూరిటీ ఉద్యోగాలకు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై 21-32 సంవత్సరాల మధ్య వయస్సు ఉండాలన్నారు. వివరాలకు 9440050951, 9440049861 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడికి తీవ్ర గాయాలు

గుత్తిరూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా గుత్తి మండలం కరిడికొండ గ్రామ శివారులో గల 44వ నంబరు జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన బాలప్రకాష్, దివ్య దంపతులు తమ కుమారుడు వివాన్‌తో కలిసి కారులో బెంగళూరుకు వెళ్తున్నారు. కరిడికొండ గ్రామశివారులోకి రాగానే కారు ప్రమాదవశాత్తూ డివైడర్‌ను ఢీకొంది. ప్రమాదంలో బాలుడు వివాన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

వర్గీకరణపై ముఖ్యమంత్రి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

సుభాష్‌నగర్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వర్గీకరణపై అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సందె కార్తిక్ డిమాండ్ చేశారు. సోమవారం ఉమ్మడి జిల్లా మాదిగ విద్యార్థుల మహాసభను పురస్కరించుకొని స్థానిక కార్ఖానగడ్డలో విద్యార్థులు, కులపెద్దలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 1న సుప్రీంకోర్టు తీర్పు న్యాయబద్ధమైనదని, అన్ని రాష్ట్రాల కంటే తెలంగాణ రాష్ట్రంలో వర్గీకరణ చేసి చూపిస్తామని ముఖ్యమంత్రి మాటి ఇచ్చి తప్పారని అన్నారు. మాట తప్పిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై మరో పోరాటానికి మాదిగ విద్యార్థులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి తన మంత్రి పదవికోసం మాలలను రెచ్చగొడుతూ తన స్వంత డబ్బుతో వర్గీకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేయిస్తున్నాడని ఆరోపించారు. దీనిని మాల మేధావులు, విద్యావేత్తలు తక్షణమే ఖండించి వర్గీకరణ సామాజిక న్యాయమని వర్గీకరణ చేసుకొని మాల మాదిగలు అన్నదమ్ములుగా కలిసి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చెంచల నవీన్, ప్రధాన కార్యదర్శి కొరవు ప్రభాకర్, ఎంఎస్‌పీ అధికార ప్రతినిధి దండు అంజయ్య, ఎంఆర్‌పీఎస్ టౌన్ అధ్యక్షుడు దండు మధు, విద్యార్థులు పాల్గొన్నారు.

మళ్లీ శ్మశానానికి చేరిన తల్లి

● రెండోసారి వదిలివెళ్లిన కొడుకులు



వృద్ధురాలితో మాట్లాడుతున్న మహిళలు

జగిత్యాల అర్బన్, డిసెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణానికి చెందిన అల్లం రాజవ్వ అనే వృద్ధురాలిని తన కుమారులు మళ్లీ శ్మశాన వాటికలో వదిలివెళ్లారు. పక్షం రోజుల క్రితం వృద్ధురాలిని శ్మశాన వాటికలో వదిలివెళ్లగా సఖీ సెంటర్ నిర్వాహకులు వృద్ధురాలిని జగిత్యాల ప్రధాన ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించారు. అనంతరం జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, సీనియర్ సిటిజన్స్ అధ్యక్షులు హరి అశోక్‌కుమార్‌లు వృద్ధురాలి కుమారులను పిలిచి కౌన్సిలింగ్ నిర్వహించి కుమారులకు అప్పగించారు. అయితే వారు వృద్ధురాలిని తిరిగి శ్మశాన వాటికలో వదిలారు. వృద్ధురాలికి చెందిన సమీప బంధువులు మరణించడంతో మూడవ రోజు కార్యక్రమానికి వచ్చిన ఓ మహిళ వృద్ధురాలి గొంతు విని ఇక్కడ ఎందుకు ఉన్నావని అడిగింది. దీంతో తన కుమారుడు సీనయ్య తనను వదిలి వెళ్లాడని ఆమెతో వృద్ధురాలు వాపోయింది. కొంచెం అన్నం పెట్టి, కప్పుకోడానికి ఏదైనా ఇవ్వమంటూ సదరు మహిళను అడగడం అక్కడున్న వారిని కలిచి వేసింది.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు సిరిసేడు విద్యార్థి ఎంపిక

ఇల్లందకుంట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట మండలం సిరిసేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న నాగపూర్ శ్రీచరణ్ రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 4న కొత్తపల్లిలోని ఆల్ఫోర్స్ ఈ టెక్నో మైదానంలో ఉమ్మడి జిల్లా స్థాయి అండర్-14 బాల బాలికల నెట్ బాల్ సెలక్షన్స్ జరిగాయి. ఈ నెల 9,10,11వ తేదీల్లో కరీంనగర్‌లోని ఆల్ఫోర్స్ ఈ టెక్నో పాఠశాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు శ్రీచరణ్ ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా శ్రీచరణ్‌ను హెచ్ఎం జగదీశ్వర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

అథ్లెటిక్స్ జాతీయ పతక విజేతకు అభినందన



నక్షత్రను అభినందిస్తున్న రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘ ప్రతినిధులు

కరీంనగర్ స్పోర్ట్స్ డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఒరిస్సా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో జరుగుతున్న 39వ జాతీయ జూనియర్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన గైని నక్షత్ర కాంస్య పతకం సాధించింది. అండర్-14 బాలికల విభాగంలో ట్రయాథ్లిన్ పోటీల్లో పాల్గొన్న ఆమె విశేష ప్రతిభచాటి కాంస్య పతకం సాధించింది. గత సెప్టెంబర్ 17 నుంచి 19 వరకు గుంటూరులో జరిగిన సౌత్‌జోన్ పోటీల్లో రజత పతకం సాధించింది. ఈ సందర్భంగా నక్షత్రనను, ఆమెకు శిక్షణ అందించిన కోచ్ తిరుపతిని రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు స్టాన్లీ జోన్స్, సారంగపాణి, కోశాధికారి రాజేశ్ కుమార్, రాష్ట్ర సంఘ బాధ్యులు వెంకట్‌రెడ్డి, జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, కడారి రవి అభినందించారు.

రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలి : డీటీసీ



సమావేశంలో మాట్లాడుతున్న డీటీసీ పురుషోత్తం

తిమ్మాపూర్,డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): వాహన షోరూం నిర్వాహకులు వాహన కొనుగోలుదారులకు రోడ్డు సేఫ్టీపై అవగాహన కల్పించాలని డీటీసీ పెద్దింటి పురుషోత్తం ఆదేశించారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో జిల్లాలోని వాహన షోరూం నిర్వాహకులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. వాహనాల కొనుగోలు సమయంలో షోరూం నిర్వాహకులు వివరాలు నమోదు చేసుకోవడంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వాహనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో తప్పులు జరుగుతున్నాయని అన్నారు. ఆధార్ కార్డులో ఉన్న చిరునామా పోస్టల్ అడ్రస్, మండలాలు సక్రమంగా ఉండేవిధంగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అప్లికేషన్‌లో అప్‌లోడ్ చేసే ప్రూఫ్‌లు సక్రమంగా ఫొటోలు తీయకపోవడం, ఇన్‌వాయిస్ ఇతరాల్లో తప్పులు రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. దీంతో రిజిస్ట్రేషన్‌లో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్, కారు నడిపే వారు ఖచ్చితంగా సీటు బెల్టు ధరించే విధంగా, అతివేగంగా వాహనాలు నడపవద్దని అవగాహన కల్పించాలన్నారు. నూతన వాహనాలు రిజిస్ట్రేషన్‌కు వచ్చినప్పుడు కొన్ని వాహనాలకు సంబంధించిన చాసిస్ నెంబర్లు సరిగా కనబడటం లేదన్నారు. రిజిస్ట్రేషన్ సమయంలో ఇబ్బందులు ఏర్పాడుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవిఐలు శ్రీకాంత్ చక్రవర్తి, రవికుమార్ పాల్గొన్నారు.

న్యాయం గెలిచింది..

- ఆది శ్రీనివాస్, ప్రభుత్వ విప్



వేములవాడ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సుదీర్ఘకాలంగా తాను చేస్తున్న పోరాటం ఫలించిందని, న్యాయం గెలిచిందని వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ పౌరసత్వాన్ని రద్దు చేస్తూ రాష్ట్ర హైకోర్టు తీర్పుపై సోమవారం ఆయన స్పందిస్తూ హర్షం వ్యక్తం చేశారు. 15 ఏళ్లుగా తాను చేస్తున్న న్యాయపోరాటానికి ఇన్నేళ్లకు ముగింపు లభించిందన్నారు. ఇన్నేళ్ల తన న్యాయ పోరాటానికి సహకరించిన వారందరికీ, మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతున్నానని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. అభ్యర్థిత్వంపై మోసం చేసినందుకు చెన్నమనేని రమేష్‌పై చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరనున్నట్లు చెప్పారు.

పౌరసత్వం వివాదం సృష్టించారు

- చెన్నమనేని రమేశ్



తన పౌరసత్వం రద్దు చేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పు తనకు తీవ్ర నిరాశను కలిగించిందని వేముల వాడ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ అన్నారు. హైకోర్టు తీర్పు వెలువరించిన అనంతరం ఆయన సోమవారం తన వ్యక్తిగత సహాయకుల ద్వారా తన అభిప్రాయాన్ని పంపించారు. హైకోర్టులో తన పౌరసత్వం పైన వెలువడిన తీర్పు తీవ్రంగా నిరాశపరిచిందని, ఈ తీర్పు హేతుబద్ధంగా లేదన్న అభిప్రాయంతో తాను ఏకీభవిస్తున్నానని పేర్కొన్నారు. రాజకీయ జీవితంలో ఒడిదొడుకులు సహజ మని, వరుసగా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన తనపై కుట్ర చేసి పౌరసత్వ వివాదం సృష్టిం చారని, హైకోర్టు తీర్పుపై అప్పీలు చేయడానికి గల అవకాశాలను తన న్యాయవాదులు పరిశీలిస్తున్నారని చెన్నమనేని రమేష్ తెలిపారు.

పొగాకు వైపు రైతుల చూపు

- అధిక ధర పలుకుతుండడంతో ఆసక్తి
- భిన్నమైన పంటల సాగుతో లాభాలు



గుబ్బపల్లిలో ఆరేందుకు కొట్టంలో కట్టిన పొగాకు తోరణాలు



గొడిశాలలో ఏపుగా పెరిగి కోత దశలో ఉన్న పొగాకు తోట

సైదాపూర్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రైతులు ప్రతి సారి ఒకే పంట వరి, మొక్కజొన్న, పత్తి పంటలు వేయడం వల్ల దిగుబడి తగ్గి నష్టాలపాలవుతున్నారు. దీంతో రైతులు ప్రత్యామ్నాయ మార్గం వైపు అడుగులు వేస్తున్నారు. ఆరుతడి పంటలు అందులో ఆదాయం ఎక్కువ వచ్చే పంటల సాగుపై మొగ్గు చూపుతున్నారు. ఆయిల్ పామ్ సాగు చేయాలని ప్రభుత్వం రైతులను ప్రోత్సహిస్తోంది. పొగాకు సాగు లాభదాయకంగా ఉండ టంతో రైతులు సాగుకు ఆసక్తి కనబరుస్తున్నారు. సైదా పూర్ మండలంలోని గొడిశాల, నల్లరామయ్యపల్లి, గుజ్జులపల్లి, ఎల్లంపల్లి, రాంచంద్రాపూర్, ఎలబోతారం, చింతలపల్లి, జాగీర్‌పల్లి గ్రామాలతో పాటు మరి కొన్ని గ్రామాలలో మొక్కజొన్న, పత్తికి బదులుగా రైతులు పొగాకు సాగు చేస్తున్నారు. ఈ పొగాకు సాగుకు పని ఎక్కువగా ఉన్నప్పటికి ఆదాయం ఎక్కువ వస్తుందని రైతులు మొగ్గు చూపుతున్నారు. గత సంవత్సరం పొగాకు సాగు చేసిన రైతులకు మంచి ధర పలికి ఒక ఎకరాకి రూ. 2.5 నుంచి 3లక్షల వరకు ఆదాయం వచ్చిందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గత సంవత్సరం క్వింటాల్‌కు రూ. 15,000 నుంచి 20,000 వేల వరకు ధర పలికిందని తెలుపుతున్నారు. ఈ సంవ త్సరం కూడా మంచి ధర పలుకుతుందని రైతులు భావి స్తున్నారు. మరోవైపు పొగాకు నారు 2వేల మొక్కలకు సుమారు 3500 ధర పలుకుతుంది. దాంతో బొగాకు నారు యజమానులు ఒక ఎకరాకు సుమారు 5నుంచి 8లక్షల వరకు సంపాదిస్తున్నట్లు రైతులు తెలు పుతున్నారు.

● పొగాకుతో పని ఎక్కువే

పొగాకు సాగు సుమారు నాలుగు నెలలో పూర్తవు తుంది. మొక్కలు ఏపుగా పెరిగే వరకు ఎరువులు వేస్తూ, కలుపు తీస్తూ, నీరు సంవృద్ధిగా కట్టాలి. మొక్కలు కొంచెం పెరగగానే మొక్క కింది భాగంలో ఎరుపుగా మారిన ఆకులు తీసి వాటిని తోరణాలు గుచ్చి నీడలో ఆరబెట్టాలి. పూర్తిగా ఎండిన తరువాత ఆ తోరణాలు తీసి ఎండిన పొగాకును మండెగా వేయాలి. చెక్క బాక్సు లలో తొక్కి బేల్లుగా తయారు చేయాలి. అప్పుడు వాటిని వ్యపారులకు విక్రయించాలి. ఇలా ఒక్కొక్క చెక్కు 50నుంచి 100కేజీల వరకు ఉంటుంది. సుమారు 3 నెలలు పని ఉంటుంది. కానీ ధర సక్రమంగా ఉంటే ఆదాయం అలాగే రెట్టింపుగా వస్తుందని రైతులు తెలుపుతున్నారు.



జాగీర్‌పల్లిలో మండెగా వేసిన ఎండిన పొగాకు

● పొగాకు లాభదాయకమే

కష్టపడి పనిచేస్తే అన్ని పంటల కన్నా పొగాకుతో లాభంగానే ఉంటుంది. ఒక రెండు నెలలు ప్రతి రోజు పొగాకు పనిమీదనే ఉండాలి. దానిని సరైన సమయం లో ఆకు తీసి ఆరబెట్టి మండెకట్టి ఆకును నల్లబడ కుండా చూసుకోవాలి. గత సంవత్సరం 20 గుంటల వరకు పొగాకు సాగు చేశాను మంచి లాభం వచ్చింది. ఈ సంవత్సరం ఒక ఎకరం వరకు సాగు చేస్తున్నా.

- గుడిసే శ్రీనివాస్, రైతు, జాగీర్‌పల్లి

కొండగట్టులో ముగిసిన విజయోత్సవాలు



కొండగట్టులో నిర్వహిస్తున్న పూజలలో పాల్గొన్న అర్చకులు, సిబ్బంది

మల్యాల, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా కొండగట్టు అంజనేయస్వామి సన్నిధిలో జరుగుతున్న ప్రజాపాలన-ప్రజావిజయోత్సవాలు సోమవారంతో ముగిశాయి. చివరి రోజు రాష్ట్ర సుభిక్షం కోసం ఆలయ స్థానాచార్యులు కపీంధర్, ప్రధానార్చకులు జితేంద్రప్రసాద్, రామకృష్ణ, ఉపప్రధానర్చకులు చిరంజీవ స్వామి, మారుతీప్రసాద్ ఆధ్వర్యంలో స్వామి వారికి పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, రామభజన కార్యక్ర మాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు హరిహరనాథ్, నీల చంద్రశేఖర్, ఆలయ సిబ్బంది, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులు సాహిత్యంపై దృష్టి సారించాలి

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత వారాల ఆనంద్



మాట్లాడుతున్న వారాల ఆనంద్

గణేశ్‌నగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సాహిత్యంపై దృష్టి సారించాలని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత వారాల ఆనంద్ అన్నారు. ఇతర భాషల విలువలను, సంస్కృతిని, రచన తత్వాన్ని మరో భాషలోకి తీసుకురావడం లక్ష్యంగా అనువాదం సాగుతుందన్నారు. సోమవారం ఎస్సారార్ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో తెలుగు అనువాద పద్ధతులపై ఒక్కరోజు కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా వారాల ఆనంద్ విద్యార్థులకు తెలుగు అనువాదంలోని మెళకువలను తెలియజేశారు. ఈసందర్భంగా ఎస్సారార్ ప్రిన్సిపాల్ రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు సాహిత్యాన్ని తమ జీవితంలో భాగంగా చేసుకొని పరిపూర్ణ వ్యక్తిత్వాన్ని రూపొందించుకోవాలన్నారు. తెలుగు విభాగాధిపతి డా.బూర్ల చంద్రశేఖర్ మాట్లాడుతూ అనువాదాలు చేసేవారు మాతృభాషా సాహిత్యాలను బాగా అధ్యయనం చేయాలన్నారు. కార్యక్రమంలో అటానమస్ కోఆర్డినేటర్ వంగల శ్రీనివాస్, అధ్యాపకులు బూర్ల వేంకటేశ్వర్లు, ప్రకాశ్, డా.ఆర్ శ్రీనివాస్, మెట్టు వేంకటేశ్వర్లు, డా. పాత అశోక్, డా. పి. చైతన్య, డా. పి. అనిల్ కుమార్, పి. శంకర్, డా. టి.బోజన్న పాల్గొన్నారు.

కాసులు కురిపిస్తున్న ఆర్టీసీ కార్గో



పంపించడానికి సిద్ధంగా ఉన్న పార్సల్స్

- రూ.9 కోట్లకు చేరువలో రీజియన్ సంవత్సర ఆదాయం
- సగానికి పైగా ఆదాయం కరీంనగర్ కౌంటర్‌లోనే

భగత్‌నగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డురవాణా సంస్థ కార్గో సేవలతో కాసులు కురిపిస్తున్నది. కరీంనగర్ రీజియన్ వ్యాప్తంగా 11 డిపోలు కరీంనగర్-1, కరీంనగర్-2, గోదావరిఖని, హుస్నాబాద్, హుజూరాబాద్, మంథని, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, సిరిసిల్ల, వేములవాడ డిపోలు ఉన్నాయి. డిపోల వారీగా కార్గో కౌంటర్లు ఏర్పాట్లు చేసి పార్సిల్స్ పంపించడం, వచ్చిన పార్సిల్స్‌ను బట్వాడ చేయడంతో ఆర్టీసీకి ఆదాయం సమకూరుతున్నది. రీజియన్ వ్యాప్తంగా పోల్చుకుంటే మొత్తం వచ్చిన ఆదాయంలో సగానికి పైగా కరీంనగర్ కౌంటర్ నుంచే వస్తోంది. కరీంనగర్ రీజియన్‌లో కార్గో సేవలతో ఆదాయ సముపార్జనలో ముందంజలో ఉంటున్నది. జనవరి నుంచి నవంబరు మాసం వరకు ఇప్పటి వరకు రీజియన్ వ్యాప్తంగా 8,76,62,753 రూపాయల ఆదాయం సమకూరింది.

● కరీంనగర్ కౌంటర్‌లో ఆదాయం

నెల	పార్సిల్స్ సంఖ్య	ఆదాయం
జనవరి	25,538	41,76,460
ఫిబ్రవరి	22,706	39,27,486
మార్చి	23,053	40,39,050
ఏప్రిల్	22,018	39,23,880
మే	23,625	41,78,474
జూన్	22,856	41,47,712
జులై	22,882	39,28,111
ఆగస్టు	24,165	42,20,101
సెప్టెంబర్	22,731	40,84,057
అక్టోబర్	24,815	44,74,236
నవంబర్	25,232	45,43,992
మొత్తం	2,59,621	4,56,43,559

కరీంనగర్ కౌంటర్‌లో ఇప్పటి వరకు 4,56,43,559 రూపాయల ఆదాయం సమకూరింది.

● జిల్లా వ్యాప్తంగా కౌంటర్లు

కార్గో సేవలందించడానికి ఆర్టీసీ 44 కౌంటర్లు ఏర్పాట్లు చేసి పార్సిల్స్‌ను అందిస్తున్నారు. కరీంనగర్ రీజియన్ వ్యాప్తంగా డిపోల పరిధిలో ఏజెంట్లను నియమించి కౌంటర్లు ఏర్పాట్లుచేసి కార్గో సేవలు అందిస్తున్నారు. గోదావరిఖని డిపో పరిధిలో 3, హుస్నాబాద్ డిపో పరిధిలో 4, హుజూరాబాద్ 7, కరీంనగర్-1 డిపో పరిధిలో 6, కరీంనగర్-2 డిపో పరిధిలో 4, మంథని పరిధిలో 3, జగిత్యాల పరిధిలో 6, కోరుట్ల పరిధిలో 4, మెట్‌పల్లిలో 1, సిరిసిల్లలో 5, వేములవాడలో ఒక కౌంటర్ ఉన్నాయి. ఇందులో కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల డిపోల్లో ఆర్టీసీ సొంతంగా కౌంటర్లు ఏర్పాటుచేసి కార్గో సేవలు అందిస్తున్నది. ప్రయాణికులను చేరవేయడమే కాకుండా తెలంగాణరాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అదనపు ఆదాయ మార్గాలను అన్వేషించి కార్గో సేవలందిస్తూ అధిక ఆదాయాన్ని ఆర్జిస్తోంది.

రీజియన్ వ్యాప్తంగా వచ్చిన ఆదాయం

నెల	పార్సిల్స్ సంఖ్య	ఆదాయం
జనవరి	51,163	83,50,042
ఫిబ్రవరి	43,709	75,73,966
మార్చి	44,860	78,56,245
ఏప్రిల్	44,059	78,93,985
మే	45,939	79,25,789
జూన్	43,049	76,76,432
జులై	43,557	74,41,901
ఆగస్టు	46,761	81,92,080
సెప్టెంబర్	43,738	78,70,135
అక్టోబరు	46,761	82,83,079
నవంబరు	47,623	85,99,099
మొత్తం	5,01,227	8,76,62,753

ప్రయాణికులకు సౌకర్యాలు అందించాలి

- ఆర్టీసీ రీజినల్ మేనేజర్లతో ఈడీ సమీక్షా సమావేశం



రీజినల్ మేనేజర్లతో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జోన్ ఈడీ ఖుస్రోషాఖాన్

భగత్‌నగర్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించాలని ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఖుస్రోషాఖాన్ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం ఆయన రీజినల్ మేనేజర్లతో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ఆదాయ వనరులను మెరుగు పరుచు కోవాలన్నారు. ప్రమాదాలను నివారించేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రీజినల్ మేనేజర్లు రాజు, సోలమన్ రాజు, సరిరాం, విజయభాను, జ్యోత్స్న, డిప్యూటి రీజినల్ మేనేజర్లు కె సత్యనారాయణ, ఎస్ భూపతిరెడ్డి, సరస్వతి, శంకర్, ప్రవీణ్, భాను కిరణ్, మాధవరావు, భవాణిప్రసాద్, డిప్యూటి చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్, స్వప్నకుమారి, వర్క్స్ మేనేజర్ సుగుణాకర్‌రావు, కె యుగేందర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, బోయేజ్‌కుమార్, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

● ఏసీ బస్సు సర్వీసుల్లో పది శాతం రాయితీ

రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఏసీ స్లీపర్, ఏసీ స్లీపర్‌కమ్ సీటర్, రాజధాని బస్సుల్లో తెలంగాణ, అంతర్రాష్ట్ర ప్రయాణికులకు గాను బేసిక్ చార్జీలో పదిశాతం రాయితీ కల్పిస్తున్నట్లు రీజినల్ మేనేజర్ రాజు ఒకప్రకటనలో తెలి పారు. ఈ అవకాశం డిసెంబరు 31వరకు ఉంటుందని ప్రయాణికులు వినియోగించుకోవాలన్నారు.

కొండెక్కిన కోడిగుడ్డు

● ఒక్కింటికి రూ. 7.50



హుజూరాబాద్‌రూరల్, డిసెంబర్ 9, (ఆంధ్రజ్యోతి): బహిరంగ మార్కెట్లో కోడిగుడ్ల ధరలు క్రమంగా పెరుగుతున్నాయి. ఇదే సమ యంలో చికెన్ ధరలు తగ్గుతూ వస్తున్నాయి. ఒక కోడిగుడ్డు ధర హోల్‌సేల్‌గా రూ. 6.2లు కాగా, రిటైల్ కాగా రూ.7 పలుకుతుండగా, గ్రామాల్లోని చిన్న దుకాణాల్లో మాత్రం రూ.7.50 ధర పలు కుతోంది. చలికాలంలో కోడిగుడ్ల ధరలు పెరగడం సాధారణమేనని కొందరు వ్యాపారులు చెబుతున్నారు. ఈ నెలలో క్రిస్మస్ పండగ ఉంది. ఈ వేడుకల్లో ప్రధానంగా కేక్‌లు కట్ చేసి సంబరాలు జరుపుకుంటున్నారు. ఇప్పటికే జిల్లాలో ముందదస్తు క్రిస్మస్ వేడుకలు ప్రారంభమ య్యాయి. ఇదే సమయంలో కేక్‌ల వినియోగం, విక్రయాలు పెరిగాయి. కేక్‌ల తయారీలో కోడిగుడ్ల వినియోగం అధికంగా ఉంటుంది. దీంతో సహజంగానే వాటికి డిమాండ్ పెరుగుతుందని కొందరు చెపుతున్నారు.

● చికెన్ ధర తగ్గుదల

కార్తీక మాసం నేపథ్యంలో చికెన్‌ధరలు తగ్గాయి. కార్తీకమాసం ప్రారంభంలో కేజి చికెన్‌ధర రూ. 230 వరకు పలికింది. మాంసాహారానికి దూరంగా ఉండటంతో డిమాండ్ పడిపోయిందని, ఫలితంగా చికెన్‌ధరలు దిగొచ్చాయని వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుతం కేజీ ధర రూ. 185 పలుకుతుంది. క్రిస్మస్, న్యూఇయర్, సంక్రాంతి వరకు చికెన్ ధరలు పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు పేర్కొంటున్నారు.

రూ. 7.5కు గుడ్డును అమ్ముతున్నారు


-చిరంజీవి, కనుకులగిద్దె



కోడిగుడ్డు రూ. 5 నుంచి ఏకంగా రూ. 7.5 వరకు ధర పెరిగింది. సామాన్యుడు కోడిగుడ్డు తినాలంటే భారమే. పిల్లలకు పౌష్టికాహారం అందించాలని కోడిగుడ్డు తినిపిస్తున్నాం. ఇప్పుడు ధర పెరుగడంతో తినిపించలేకపోతున్నాం.

కోడెలు అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తిపై చర్య తీసుకోవాలి

- వేములవాడ పట్టణ పోలీసులకు బీజేపీ నేతల ఫిర్యాదు



వేములవాడ పట్టణ ఎస్సై అంజయ్యకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

వేములవాడ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం గోశాల నుండి కోడెలను తీసుకువెళ్లి గోవధశాలకు విక్రయిస్తున్న మాదాసు రాంబాబు అనే వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వేములవాడ పట్టణ బీజేపీ అధ్యక్షుడు, పురపాలక సంఘం 20వ వార్డు కౌన్సిలర్ రేగుల సంతోష్ బాబు పోలీసులను కోరారు. ఈ మేరకు స్థానిక బీజేపీ నేతలతో కలిసి సోమవారం వేములవాడ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వరంగల్ జిల్లా గీసుకొండ మండలం మనుగొండ గ్రామానికి చెందిన మాదాసు రాంబాబు అనే వ్యక్తి ఓ సొసైటీ పేరుతో దాదాపుగా 60 కోడెలను వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవాలయం గోశాల నుండి తీసుకెళ్లి అక్రమంగా గోవధ శాలలకు అమ్ముతున్నట్లు తేలిందని, ఈ ఘటనపై కేసు నమోదు చేసి సమగ్రంగా విచారణ జరిపి సదరు వ్యక్తితో పాటు అతనికి సహకరించిన అందరిపై తగిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం గోశాలలో జరుగుతున్న అక్రమాలపై పోలీసు శాఖ పక్షాన విచారణ జరపాలని కోరినట్లు ఈ సందర్భంగా రేగుల సంతోష్ బాబు తెలిపారు. దేవాలయాల పట్ల నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్నట్లు కోడెల వ్యవహారంతో స్పష్టంగా తెలిసిపోతున్నదని, రాజన్న కోడెలను అక్రమంగా దళారులకు దొంగ చాటుగా అందజేస్తున్నారని అన్నారు. రైతులకు కోడెల పంపిణీ పేరిట పెద్ద ఎత్తున హంగు ఆర్భాటాలతో కార్యక్రమం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం కోడెల పంపిణీలో జరుగుతున్న అక్రమాలను పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తున్నదని అన్నారు. మొత్తం వ్యవహారంపై ప్రభుత్వం సైతం సమగ్ర విచారణ జరిపి దోషులను శిక్షించాలని, మరోసారి కోడెలు పక్కదారి పట్టకుండా తగిన చర్యలు తీసుకోవాలని సంతోష్ బాబు కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పిన్నింటి హనుమాన్లు, అక్కపెల్లి వివేక్ రెడ్డి, గుడిసె మనోజ్, రేగుల రాజకుమార్, నామాల శేఖర్, బిల్ల కృష్ణ, మైలారం శ్రీనివాస్, జవ్వాజి రాజశేఖర్, రేగుల శ్రీకాంత్, మామిళ్ళ లక్ష్మీరాజం, నేరెళ్ల సాయి, సగ్గు రాహుల్, కోరేపు వెంకటేష్ పాల్గొన్నారు.

వేములవాడకు పోటెత్తిన భక్తజనం



భక్తులతో కోలాహలంగా మారిన రాజన్న ఆలయ ప్రాంగణం

వేములవాడ కల్చరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి క్షేత్రానికి సోమవారం భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాలను తరలివచ్చిన భక్తులు కోనేరులో పవిత్రస్నానాలు ఆచరించి, కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. తెల్లవారు జాము నుంచి కోడె మొక్కు క్యూలైన్‌లో బారులుదీరారు. రాజన్నకు ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకునేందుకు భక్తులు సుమారు మూడు గంటలపాటు నిరీక్షిం చారు. ధర్మదర్శనం, శీఘ్రదర్శనం, బ్రేక్ దర్శనం క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి ప్రవేశించిన భక్తులు పార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు. అనుబంధ ఆలయాల్లో కుంకుమ భక్తులు పూజల్లో పాల్గొన్నారు. అనంతరం బద్దిపోచమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన

కరీంనగర్ రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం బొమ్మకల్ గ్రామంలో బీరయ్య-కమరవతి, మహంకాళి మాత విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కురుమ కుల సంఘ సభ్యులు, గ్రామ ప్రజలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

టాలెంట్ టెస్ట్

కరీంనగర్ రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జీవశాస్త్ర ఫోరం ఆధ్వర్యంలో బయోలజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్ ప్రశ్నాపత్రాలను సోమవారం ఎంఈవో రవీందర్ విడుదల చేసి పరీక్షలను నిర్వహించారు. ఈ టెస్ట్‌లో నగునూర్ జిల్లా పరిషత్ విద్యార్థి కుమార్, యం రాహుల్, చామనపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ కుమారి, కావ్యకు ప్రథమ స్థానంలో నిలువగా జూబ్లీనగర్ జిల్లా పరిషత్ విద్యార్థి కుమార్, అక్షరకు ద్వితీయ స్థానం సాధించారు. కార్యక్రమంలో టీబీఎస్ఎఫ్ మండల ఇంచార్జి జి శంకరయ్య, ఇంచార్జి ప్రధానోపాధ్యాయుడు తిరుపతి రావు, టీబీఎస్ఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఎ అంజనేయులు పాల్గొన్నారు.

రేపటి నుంచి సీఎం కప్ పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ అర్బన్ మండల స్థాయి సీఎం కప్ పోటీలను బుధవారం నుంచి నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో ఈ ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నామని మండల విద్యాశాఖాధికారి గొట్టి ప్రమోద తెలిపారు. 11న కబడ్డీ, యోగా క్రీడాంశాలను, 12న వాలీబాల్, అథ్లెటిక్స్ క్రీడాంశాలను, 13న ఖో-ఖో, ఫుట్‌బాల్ క్రీడాంశాల్లో ఎంపిక పోటీలను నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు మంగళవారం అంబేద్కర్ స్టేడియంలో మండల క్రీడల కన్వీనర్ అంతటి శంకరయ్యను ఉదయం 9 గంటలకు కలిసి అందజేయాలని కోరారు. వివరాలకు సెల్ నెం. 9849114956లో సంప్రదించాలని తెలిపారు.

క్రీడలతో మానసిక ఆరోగ్యం

భగత్‌నగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఆరోగ్యం పెంపొందుతాయని చింతకుంట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తాండ్ర శోభారాణి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి వేణు గోపాల్ అన్నారు. సోమవారం సీఎం కప్ గ్రామస్థాయి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాస్, జూనియర్ కళాశాల అధ్యాపకురాలు సుష్మ పాల్గొన్నారు.

ఘనంగా సోనియాగాంధీ జన్మదిన వేడుకలు



తెలంగాణ చౌక్‌లో కేక్ కట్ చేస్తున్న సుడా ఛైర్మన్ నరేందర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా సోమవారం జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. డీసీసీ కార్యాలయంలో నగర కాంగ్రెస్ అధ్యక్షుడు, సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ సత్తు మల్లేశం, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్ తదితరులు కేక్ కట్ చేశారు. అనంతరం నగరంలోని ఇందిరాచౌక్ వద్ద వేడుకలు నిర్వహించారు. నగరంలో నిర్వహించిన వేర్వేరు కార్యక్రమాల్లో జిల్లా మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రజితరెడ్డి, జిల్లా కాంగ్రెస్ మైనారిటీ సెల్ అధ్యక్షులు ఎండి తాజుద్దీన్, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఆకారపు భాస్కర్‌రెడ్డి, నగర కాంగ్రెస్ మైనారిటీ సెల్ అధ్యక్షులు మహమ్మద్ అహ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

● **గణేశ్‌నగర్:** నగరంలోని తెలంగాణ చౌక్‌లో కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ సత్తు మల్లేశం, మాజీ ఎమ్మెల్యే ఆరేపల్లి మోహన్, పురుమల్ల శ్రీనివాస్, ఎండి తాజ్ పాల్గొన్నారు.

కరీంనగర్ రూరల్, డిసెంబర్(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలంలో పలు గ్రామాల్లో సోనియాగాంధీ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఇరుకుల్లలో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు కాశిపాక రాకేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయిని తిరుపతి, మండల అధ్యక్షుడు కాంరెడ్డి రాంరెడ్డి, జువ్వాడి మారుతిరావు పాల్గొన్నారు.

● **కరీంనగర్ రూరల్:** కరీంనగర్ మండలంలో పలు గ్రామాల్లో సోనియాగాంధీ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఇరుకుల్లలో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు కాశిపాక రాకేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయిని తిరుపతి, మండల అధ్యక్షుడు కాంరెడ్డి రాంరెడ్డి, జువ్వాడి మారుతిరావు పాల్గొన్నారు.

● **భగత్‌నగర్:** కొత్తపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, దుబాసి కుమార్, యాస్వాడ రాజ్‌కుమార్, పొన్నం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● **హుజూరాబాద్/శంకరపట్నం/గన్నేరువరం/మానకొండూర్/గంగాధర/వీణవంక/జమ్మికుంట/సైదాపూర్/ఇల్లందకుంట/చిగురుమామిడి/రామడుగు/చొప్పదండి:** హుజూరాబాద్ పట్టణంలో సోనియాగాంధీ జన్మదిన వేడుకలు నిర్వహించారు. శంకరపట్నంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గోపగోని బసవయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గన్నేరువరంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. మానకొండూర్ మండలంలో సోనియాగాంధీ జన్మదిన వేడుకలు జరిగాయి. గంగాధర మండలంలో నిర్వహిం చిన కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు పురుమల్ల మనోహర్ పాల్గొన్నారు. వీణవంక మండలంలో జన్మదిన వేడుకలు జరిగాయి. జమ్మికుంట పట్టణంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుంకరి రమేష్ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. సైదాపూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు, వ్యవసాయ మార్కెట్ ఛైర్మన్ దొంత సుధాకర్ పాల్గొన్నారు. ఇల్లందకుంటలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రామారావు పాల్గొన్నారు. చిగురుమామిడి మండలం చిన్న ముల్కనూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో హుస్నాబాద్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కంది తిరుపతిరెడ్డి పాల్గొన్నారు. రామడుగులో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జవ్వాజి హరీష్ పాల్గొన్నారు. చొప్పదండిలో నిర్వహించిన కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు నల్లాల అఖిల్ పాల్గొన్నారు.

'ప్రశ్నించే తత్వంతోనే అవినీతి అంతం'



మాట్లాడుతున్న ముదుగంటి సుధాకర్ రెడ్డి

కరీంనగర్ టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రశ్నించే తత్వం పెరగాలని, అప్పుడే అవినీతి అంతం అవుతుందని తెలంగాణ జనసత్తా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ముదిగంటి సుధాకర్ అన్నారు. సోమవారం అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నగరంలోని వాణినికేతన్ డిగ్రీ కళాశాలలో అవినీతి అంతం-మన పంతం అనే కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రోజు రోజుకు అభివృద్ధి పనుల్లో జాప్యం జరుగుతుందని, అవినతి పెరిగిపోవడం కొన్ని కార్యాలయాల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా లంచాలు ఇవ్వడం పరిపాటి అయిందని ఆయన అన్నారు.

ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రేక్షక పాత్ర వహించడం సిగ్గుచేటని అన్నారు. అవినీతి నివారణకు చట్టాలు కట్టుదిట్టం చేసి పౌరులకు సుపరిపాలన, శక్తివంతమైన పాలనను అందించి అన్ని రంగాల్లో ప్రగతి సాధించే విధంగా పౌరులంతా దేశ సౌభాగ్యానికి మూల స్తంభాలుగా నిలవాలని ఆయన యువతకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దాసరి వేణుగోపాల్ రెడ్డి, చిలుక రవీందర్, ఎ సుజాత, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

టీయూడబ్ల్యూజే(ఐజేయూ) ఉపాధ్యక్షుడిగా గాండ్ల సంపత్ ఏకగ్రీవం



కరీంనగర్ అర్బన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఐజేయూ) జిల్లా ఉపాధ్యక్షుడిగా గాండ్ల సంపత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. టీయూడబ్ల్యూజే ఎన్నికలలో భాగంగా జిల్లా ఉపాధ్యక్షుడి పదవి కోసం కేవలం ఒక నామినేషన్ దాఖలు కావటంతో సంపత్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లుగా ఎన్నికల నిర్వహణ బాధ్యులు ప్రకటించారు. సంపత్‌ను ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యులు నగునూరి శేఖర్, ఎన్నికల అధికారి టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్య క్షులు, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు బుర్ర సంపత్‌లు అభినందించారు.

డ్రైనేజీ నిర్మాణాన్ని పూర్తి చేయండి

కరీంనగర్ రూరల్, డిసెంబర్9 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారు 2వ డివిజన్ వల్లంపహడ్ గ్రామంలో మురికి కాలువ అసంపూర్తిగా నిర్మాణం చేయడంతో మురికి నీరు నిలిచి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని గ్రామస్థులు సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామంలో ప్రాథమిక పాఠశాలతో పాటు పక్కనే అంగన్‌వాడీ కేంద్ర అనుకొని ఉన్న డ్రైనేజీని కొంత వరకు నిర్మించి పాఠశాల వద్ద అసంపూర్తిగా వదిలివేయడంతో మురుగు నీరు పాఠశాల వద్ద చేరి నిలిచి పోవడం వల్ల దుర్వాసనతో పాటు దోమల తీవ్రత అధికమవుతుందని పేర్కొన్నారు.

దీంతో ప్రాణాంతకమైన వ్యాధులైన డయేరియా, డెంగ్యూ, మలేరియా వంటి రోగాల బారిన పడుతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలకు కూడా విద్యార్థులు రావడానికి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే మురికి కాలువ నిర్మాణ పనులను పూర్థి స్థాయిలో చేపట్టి మురికి నీరు నిలువ ఉండకుండా చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కలెక్టర్‌ను కోరారు.

సాహిత్య వేదిక అవార్డు అందుకున్న రవికుమార్

సుభాష్‌నగర్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): భవాని సాహిత్య వేదిక అధ్యక్షుడు వైరాగ్యం ప్రభాకర్ ఆధ్వర్యంలో నూరవ పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం నగరంలోని ఐఎంఏ హాలులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పుస్తకావిష్కరణ అనంతరం వివిధ రంగాలలో సమాజిక సేవా కార్యక్రమలు నిర్వహించిన వారిని అవార్డుతో సన్మానించారు.

ఇన్‌స్పైర్ అవార్డుకు అల్ఫోర్స్ విద్యార్థి ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి

భగత్‌నగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాల విద్యార్థి ఎం.జయంత్ క్షత్రజ్ఞ రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపికయ్యారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అవార్డుకు ఎంపికైన విద్యార్థిని అల్ఫోర్స్ ఛైర్మన్ నరేందర్‌రెడ్డి అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఐఎంవి కంట్రోల్ స్మార్ట్ వీల్‌ఛైర్ నమూనా ఎంపిక కావడమే కాకుండా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యిందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధనుర్మాస వ్రత మహోత్సవాలను విజయవంతం చేయాలి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న భాష్యం వరప్రసాదశర్మ

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని యజ్ఞవరాహక్షేత్రంలో సర్వవైదిక సంస్థానం ట్రస్టు ఆధ్వర్యంలో ఈనెల 16 నుంచి జనవరి 14 వరకు జరిగే ధనుర్మాస వ్రత మహోత్సవాలను విజయవంతం చేయాలని ఉపకులపతి శ్రీభాష్యం వరప్రసాదశర్మ తెలిపారు. సోమవారం ఆలయంలో కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. సాతులూరి గోపాల కృష్ణమాచార్యస్వామి ఈ యేడు నెల రోజుల పాటు ప్రవచనం చేయనున్నారని తెలిపారు. ప్రతీ రోజూ ఉదయం 9-30 గంటల నుంచి 11 గంటల వరకు శ్రీవచన భూషణం, సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు తిరుప్పావై ప్రవచనం ఉంటాయని పేర్కొన్నారు. సమావేశంలో కొదుమగుళ్ళ సుగుణాకారాచార్యులు, కెఎస్ అనంతాచార్యులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఔదార్యం

-ప్రభుత్వ స్కూల్‌లో బాత్‌రూం షెడ్ నిర్మాణం

కరీంనగర్ రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం చామనపల్లి జిల్లా పరిషత్ స్కూల్‌కు చెందిన పూర్వ విద్యార్థులు తమ సొంత ఖర్చులతో బాత్‌రూం షెడ్ నిర్మించారు. చామనపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో 2001-02 పదో తరగతికి చెందిన పూర్వ విద్యార్థులు 20వేల రూపాయల వ్యయంతో టాయిలెట్ షెడ్ నిర్మించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గర్వందుల సంతోష్, దీకొండ శ్రీనివాస్, వడ్లకొండ రాజు, లింగపంల్లి మహేందర్, శంకర్ పాల్గొన్నారు.

ఎస్‌యూ విద్యార్థులకు ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యం

కరీంనగర్ టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్శిటీలో చదువుకున్న ప్రతి విద్యార్థి ఉద్యోగంతోనే బయటకు వెళ్లాలనే లక్ష్యంతో ఏడాదికి రెండుసార్లు జాబ్ మేళా నిర్వహిస్తామని శాతవాహన యూనివర్శిటీ ప్రొఫెసర్ ఉమేశ్‌కుమార్ చెప్పారు. సోమవారం నగరంలోని కిమ్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో నిర్వహించిన ప్రారంభ్ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థులకు తప్పనిసరిగా 75శాతం హాజరు ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కిమ్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ పేర్యాల రవీందర్‌రావు, దేవేందర్‌రావు, వైస్ ఛైర్మన్ సాకేత్ రామారావు, ప్రిన్సిపాల్స్ అర్జున్‌రావు, అనూష్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

సుభాష్‌నగర్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కొద్ది నెలలుగా సర్వేలు, ఇతర శాఖల విధులు నిర్వహిస్తూ పని ఒత్తిడి గురవుతున్నామని, తమ సమస్యలు పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శులు కోరారు. సోమవారం టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు ప్రఫుల్‌దేశాయ్, లక్ష్మికిరణ్‌లను కలిసి వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో హర్మిందర్‌సింగ్, కోదారి అజయ్, టీపీఎస్సీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమేశ్, కార్యదర్శి సుస్మిత, అసోసియేట్ కార్యదర్శి రాకేశ్, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఇరుకు రోడ్డులో ఇళ్ల నిర్మాణం

- రోడ్డు విస్తరణకు బ్రేక్

-ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

కరీంనగర్ టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సుభాష్‌నగర్ ప్రాంతంలో ఇరుకురోడ్డులో ఇళ్ల నిర్మాణం చేపట్టడంతో ప్రయాణికులు, కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రోడ్లలో సుభాష్‌నగర్ నుంచి సీతారాంపూర్, ఆరెపల్లికి వెళ్ళే అప్రోచ్ రోడ్డు ఒకటి. సుభాష్‌నగర్ విగ్రహం నుంచి సీతారాంపూర్ అప్రోచ్ రోడ్డు వరకు దాదాపు 2 కిలో మీటర్ల పొడవు ఉన్న రోడ్డును స్మార్ట్‌సిటీలో ఎంపిక చేసి 60 ఫీట్లతో విస్తరించాలని నిర్ణయించారు. 20 ఫీట్ల రోడ్డును ఒకేసారి 60 ఫీట్లు చేస్తే రోడ్లకు ఇరువైపు ఉన్న ఇళ్ళు కూల్చివేయాల్సి వస్తుందని ఐదు డివిజన్ల ప్రజలు 40 ఫీట్లకు కుదించి విస్తరించి అభివృద్ధి చేయాలని ఆయా డివిజన్ల కార్పొరేటర్లు అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు.

రోడ్డును 40 ఫీట్లకు కుదించి కొత్తగా ఇళ్ళ నిర్మాణం చేసుకునే వారికి అనుమతి ఇస్తున్నారు. దీనితో 1800 మీటర్ల పొడవులో ఉన్న ఈ రోడ్డు ఇప్పటికే 1500 మీటర్ల మేరకు 40ఫీట్లతో విస్తరణ జరిగింది. మిగిలిన 300 మీటర్ల రోడ్డు ఇప్పటికీ విస్తరించక పోవడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో స్కూల్ బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాలతో రద్దీగా మారి ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఈ 300 ఫీట్ల రోడ్డును కూడా విస్తరించి ఇబ్బంది జరుగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. సుభాష్‌నగర్ విగ్రహం నుంచి 300 మీటర్ల రోడ్డు మాత్రమే ఇరుకుగా ఉంది. ఇదిలా ఉంటే ఈ రోడ్డును ఆనుకొని ఒకరు తాజాగా ఇంటి నిర్మాణం చేస్తున్నారు. దీనితో 1500 మీటర్లు రోడ్డు విస్తరించినా ప్రయోజనం లేకుండా పోతుందని, దీనిపై చర్య తీసుకోవాలని 22వ డివిజన్‌కార్పొరేటర్ గంట కళ్యాణిశ్రీనివాస్‌తో పాటు స్థానికులు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా కూడా అధికారులు పట్టించుకోక పోవడం లేదు. దీనితో నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డును విస్తరించేందుకు చర్యలు చేపట్టాలని, 40 ఫీట్లకు అనుమతి ఇవ్వాలని, ఒకవేళ 20 ఫీట్లతో అనుమతులు తీసుకున్నా 10 ఫీట్లు సెట్ బ్యాక్‌కావలసి ఉంటుందని, సెట్ బ్యాక్ లేకుండా ఇంటినిర్మాణ పనులను నిలిపివేయాలని 20,21,22,23,40 డివిజన్ల ప్రజలు, ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.

సెలవుదినాల్లో సర్వే నుంచి మినహాయింపు ఇవ్వాలి



ఎంపీడీవో కృష్ణప్రసాద్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్యదర్శులు

శంకరపట్నం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు సెలవుదినాల్లో పంచాయతీ కార్యదర్శులకు సర్వేల నుంచి మినహాయింపు ఇవ్వాలని మండల పంచాయతీ కార్యదర్శులు కోరారు. సోమవారం మండల పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీవో కృష్ణప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలనకు ఆదివారం, రెండో శనివారం ఇతర ప్రభుత్వ సెలవుదినాల్లో తమకు మినహాయింపు ఇవ్వాలన్నారు. ఒకవేళ ప్రభుత్వ సెలవుదినాల్లో పనిచేయాలని ఆదేశిస్తే ఇతర రోజుల్లో సెలవులను వినియోగించుకునేలా అవకాశం కల్పించాలన్నారు.

మొక్కజొన్న రైతులకు అవగాహన

తిమ్మాపూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి):మండలంలోని మొగిళిపాలెం గ్రామంలో అఖిల భారత మొక్కజొన్న పరిశోధన కేంద్రం, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం సంయుక్తంగా జాతీయ ఆహార భద్రత మిషన్‌లో భాగంగా జీరో టిల్లేజ్ మొక్కజొన్న పంటపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాజి మంజులత మొక్కజొన్న సాగు విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయధికారి సురేందర్, వ్యవసాయ పరిశోధన స్థానం కరీంనగర్ శాస్త్రవేత్తలు పి.మధుకర్‌రావు, డి.శ్రావణి, వ్యవసాయధికారి డి.పద్మ పాల్గొన్నారు.

'మహనీయుల విగ్రహాలను ఆవిష్కరించాలి'

తిమ్మాపూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి)మండలం కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ఏర్పాటు చేసిన అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్‌ల విగ్రహాలను ఆవిష్కరించాలని సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో మండల జేఏసీ నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల జేఏసీ నాయకులు మాతంగి శంకర్, వంతడుపుల సంపత్ ఇతర నాయకులు పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తులకు ముస్లింల భిక్ష



మద్దికుంటలో ముస్లింలు అయ్యప్ప స్వాములకు ఏర్పాటు చేసిన భిక్ష

మానకొండూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దికుంట గ్రామానికి చెందిన ముస్లిం సోదరులు ఎండి. ముస్తఫా, ఎండీ తాజోద్దీన్‌లు గ్రామానికి చెందిన పలువురు అయ్యప్ప భక్తులకు సోమవారం భిక్ష పెట్టారు. ఇలాంటి కార్యక్రమం గ్రామంలో ప్రతి ఏటా కొనసాగిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ భిక్ష కార్యక్రమంలో 24మంది అయ్యప్ప దీక్షాపరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో మాజీ సర్పంచ్‌లు



హుజూరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఉన్న మాజీ సర్పంచ్‌లు

హుజూరాబాద్‌రూరల్, డిసెంబర్ 9(ఆంధ్రజ్యోతి): సర్పంచ్‌ల పాలనలో గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను క్లియర్ చేయాలని కోరుతూ హైద్రాబాద్‌లో రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం అసెంబ్లీ ముట్టడికి పిలుపునివ్వగా, మండలం నుంచి మాజీ సర్పంచ్‌లు వెళ్తున్నారన్న సమాచారం మేరకు ఆయా గ్రామాల సర్పంచ్‌లను పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు.ఈ సందర్భంగా రంగాపూర్ మాజీ గ్రామ సర్పంచ్ బింగి కరుణాకర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో సర్పంచ్‌లకు రావాల్సిన పెండింగ్ బకాయిలను చెల్లించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా బిల్లులను వెంటనే క్లియర్ చేయాలని కోరారు. పోలీసుల అదుపులో మాజీ సర్పంచ్‌లు ప్రతాప్‌రెడ్డి, మనోహర్, పాకాల లక్ష్మీరెడ్డి, నిరోషా కిరణ్ తిరుమల తిరుపతి ఉన్నారు.

● చిగురుమామిడి: పెండింగ్ బిల్లుల కోసం చలో హైదారాబాద్‌కు తరలివెళ్తున్న మాజీ సర్పంచ్‌లను సోమవారం మండలంలో ముందస్తుగా స్థానిక పోలీస్‌లు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. మండలంలోని గాగిరెడ్డిపలి గ్రామ మాజీ సర్పంచ్ సన్నీల్ల వేంకటేశంను ఉదయం ఇంటివద్ద అరెస్టు చేశారు. సర్పంచ్‌లు మాట్లాడతూ తమకు రావల్సిన పెండింగ్ బిల్లుల కోసం ప్రభుత్వానికి విన్నవించడానికి వెళ్తున్న క్రమంలో పోలీసులు అరెస్టు చేయడం సరికాదన్నారు. అప్పులు తెచ్చి గ్రామాలను అభివృద్ధి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు జక్కుల రవీందర్, బెజ్జంకి లక్ష్మణ్, బొయిని శ్రీనివాస్, వకుళ, వేంకటనర్సింహరెడ్డి, లతో అన్ని గ్రామాల సర్పంచ్‌లు తదితరలు ఉన్నారు.

ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ ఎన్నిక

సైదాపూర్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలోని ఎలబోతారం ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నమిండ్ల బాబు, ప్రధాన కార్యదర్శిగా నమిండ్ల రవీందర్, ఉపాధ్యక్షులుగా మొలుగు శ్రీనివాస్, మొలుగు కుమార్, నమిండ్ల కరుణాకర్, కార్యదర్శులుగా అందాసి రాఘు, నమిండ్ల చిరంజీవి, మేకల సమ్మయ్య, సంయుక్త కార్యదర్శులుగా కొయ్యడ నర్సయ్య, మొలుగు తిరుమలేష్, అందాసి సుధాకర్, ప్రచార కార్యదర్శులుగా మొలుగు హరీష్, నమిండ్ల రాజు, కార్యవర్గ సభ్యులుగా నమిండ్ల ఎల్లయ్య, మొలుగు వీరస్వామి, అందాసి నర్సయ్య, నమిండ్ల వెంకటరాజం, మొలుగు సమ్మయ్య, అందాసి కుమార్, మొలుగు కొమురయ్యలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల ఇంచార్జ్ ఎంఎస్పీ రాష్ట్ర నాయకులు మారేపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన సీఎం కప్ పోటీలు

వీణవంక,డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాల క్రీడా మైదానంలో సోమవారం సీఎం కప్ పోటీలు ప్రారంభమయ్యాయి. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో క్రీడలు నిర్వహించినట్లు హెచ్ఎం పులి అశోక్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఎస్‌జీఎఫ్ సెక్రటరీ పోతన శ్రీనివాస్, వీణవంక గ్రామ కార్యదర్శి యశోద, సీనియర్ క్రీడకారుడు ముజామిల్‌లు ఉన్నారు.

● రామడుగు: ఈ నెల 10 నుంచి మండల స్థాయి సీఎం కప్ పోటీలు ప్రారంభం కానున్నట్లు ఎంపీడీవో రాజేశ్వరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10న బాలుర, 11న బాలికలకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో క్రీడలు నిర్వహించనున్నట్లు తెలిపారు. బాలబాలికలకు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

● గంగాధర : గంగాధరలో మంగళవారం నుండి సీఎం కప్ మండలసాయి క్రీడలను నిర్వహిస్తున్నట్లు పీడీ బాబు శ్రీనివాస్ తెలిపారు. గంగాధర జిల్లా పరిషత్ మైదానంలో 10న బాలురకు,11న బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు, 12న బాల బాలికలకు అథ్లెటిక్స్, ఫుట్ బాల్ క్రీడలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

రాష్ట్రంలో రానున్నది బీజేపీ ప్రభుత్వమే

● కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్‌రెడ్డి



నియామక పత్రం అందిస్తున్న కరివేద మహిపాల్‌రెడ్డి

జమ్మికుంట రూరల్, డిసెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా రాబోయేది బీజేపీ ప్రభుత్వమే అని కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం జమ్మికుంట పట్టణంలో నిర్వహించిన బూత్ కమిటీల నియామకాల కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను గడప గడపకు తీసుకు వెళ్లాలని సూచించారు. ఆరు గ్యారంటీల పేరిట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ హామీ లు అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎరబెల్లి సంపత్‌రావు, పట్టణ అధ్యక్షులు జీడి మల్లేష్, ప్రధానకార్యదర్శి పల్లపు రవి, ఇటుకాల స్వరూప, తూడి రవిచందర్‌రెడ్డి పాల్గొన్నారు.

● హుజూరాబాద్: పట్టణంలో సశక్తికిరణ్ అభియాన్‌లో భాగంగా సోమవారం బీజేపీ పట్టణాధ్యక్షుడు గంగిశెట్టి రాజు ఆధ్వర్యంలో 26,64,65,33 బూత్ అధ్యక్షులను ఎన్నుకున్నారు. ఎన్నికల ఇన్‌చార్జీ, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ దొండు కొంరయ్య సమక్షంలో గుళ్ల అనిల్, అపరాధ రమణ, మొలుగూరి రాజు, అయిత సందీప్‌లను బూత్ అధ్యక్ష లుగా ఎన్నుకొని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు రాజశేఖర్, శ్రీని వాస్, వాసు, సంజీవరెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

శంకరపట్నం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను సోమవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండలాధ్యక్షుడు గోపగోని బసవయ్య అందజేశారు. కార్యక్రమంలో హుజూరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ నాంపల్లి తిరుపతి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆడెపు అజయ్, కనుకుంట్ల శంకర్ ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీకి రాజీనామా

మానకొండూర్, డిసెంబరు 09 (ఆంధ్ర జ్యోతి) : మానకొండూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అపరాజు శ్రీనివాసరావు సోమవారం తన పదవికి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతో పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు తన రాజీనామా పత్రాన్ని ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షులు కవ్వంపల్లి సత్యనారాయణకు పంపించినట్లు తెలిపారు.

బీజేపీ సభ్యత్వాల పరిశీలన

శంకరపట్నం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బీజేపీ మండలాధ్యక్షుడు ఏనుగుల అనిల్ ఆధ్వర్యంలో బీజేపీ సభ్యత్వ రికార్డులను ఎన్నికల ఇన్‌చార్జీ ఆకుల రాజేందర్ పరిశీలించారు.

అవార్డు అందజేత

జమ్మికుంట రూరల్, డిసెంబర్ 09 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ధర్మారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పాత సత్యం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఫెలోషిప్ అవార్డును ఢిల్లీలోని పంచశీల క్షేత్రంలో దళిత సాహితీ అకాడమీ జాతీయ అధ్యక్షుడు, మాజీ గవర్నర్ డాక్టర్ ఎస్‌పి సుమనాక్షర్ చేతుల మీదుగా సోమవారం అందుకున్నారు.

అరెస్టులు సిగ్గుచేటు

చిగురుమామిడి: మండలంలోని మాజీ సర్పంచ్‌లను అరెస్టు చేయడం సిగ్గుచేటని బీజేపీ మండల అధ్యక్షుడు పైడిపల్లి శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు.

బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే కఠిన చర్యలు

చిగురుమామిడి: బాల్యవివాహాలను ప్రోత్సహించిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు ఉంటాయని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రమాదేవి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహలపై అవగాహన కల్పించారు.